టీ పాయింట్‌లో గంజాయి పట్టివేత

కామారెడ్డి, ఏప్రిల్ 26 : జిల్లా కేంద్రంలోని ఓ టీ పాయింట్ వద్ద దాడులు నిర్వహించి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎక్సైజ్ అధికారి రవీందర్ రాజు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఉన్న శ్రీ ఆంజనేయ టీ పాయింట్ వద్ద ఏడు ప్యాకెట్ల గంజాయి లభించిందని, నిర్వాహకుడు కడారి స్వామిపై కేసు నమోదు చేసి 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిజామాబాద్‌లోని ఆటోనగర్‌లో నివాసం ఉంటున్న ఫరీదాబేగం దగ్గర గంజాయిని కడారి స్వామి కొనుగోలు చేశాడని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆటోనగర్‌లో ఉండే ఫరీదాబేగం ఇంట్లో తనిఖీలు చేపట్టగా 3.48 కిలోల గంజాయి లభించిందని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని చెప్పారు. సమావేశంలో అధికారులు హన్మంత్‌రావు, ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్, ఎస్సై విక్రమ్‌కుమార్, సిబ్బంది భాస్కర్, మైసరాజు, సద్ది రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26 : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగ్‌పూర్ గేటు వద్ద వారం రోజుల క్రితం నడ్పల్లి తండాకు చెందిన బంటు సతీశ్ (27)ను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన సతీశ్‌ను జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుడికి భార్య, ఆరు నెలల కూతురు ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వేసవి విరామ బైబిల్ తరగతులు ప్రారంభం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26 : మండలంలోని బర్దిపూర్ గ్రామంలో ఉన్న సీఎస్ఐ వెస్లీ చర్చిలో వేసవి విరామ బైబిల్ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ప్రెస్బిటర్ ఇన్‌చార్జి, జీడీసీసీ సండే స్కూల్ సెక్రటరీ రెవరెండ్ దినకర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది వేసవి కాలంలో 'నేను.. ఒక ఆశ్చర్యం' అంశంపై పిల్లలకు బోధన ఉంటుందని పేర్కొన్నారు. సండే స్కూల్ సూపరింటెండెంట్ జి.ఇందిర, ఉపాధ్యాయులు ప్రతిమ, కృప, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ ముగింపు సభ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26 : టీయూలో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) 54వ ఆవిర్భావ ముగింపు సభను శుక్రవారం నిర్వహించారు. యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో క్రీడా కార్యక్రమాలను నిర్వహించారు. ముగింపు సభలో రిజిస్ట్రార్ యాదగిరి పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల వికాసానికి చదువుతోపాటు సమాజంలో ఉన్న అంశాలపై కూడా అవగాహన అవసరమన్నారు. విద్యార్థులు క్రీడల్లో సైతం రాణించాలని సూచించారు. ప్రధానవక్తగా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, ఆర్మూర్ మండల ప్రజాపరిషత్ చైర్మన్ పస్క నర్సయ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిరె శ్రీశైలం, బాలకృష్ణ, పున్నయ్య, దత్తహరి, శ్రీనివాస్, నేత, సాగర్‌నాయక్, రాజేందర్, మహేశ్, శ్రీకాంత్, నవీన్, కుశకుమార్, రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 26 : టీయూ పరిధిలో పీజీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్, ఐఎంబీఏ 10వ సెమిస్టర్, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఒకటో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు నాలుగో రోజైన శుక్రవారం 355 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 331 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.

విద్యార్థినికి ఘనసన్మానం

ధర్పల్లి, ఏప్రిల్ 26 : మండల కేంద్రానికి చెందిన ఎడ్ల సృజన ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడంతో గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదివి బైపీసీ 440కి 435 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు.

టాపర్లకు సీఐ అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న సీఐ భిక్షపతి

సిరికొండ, ఏప్రిల్ 26 : ఈ -అభ్యాస్ అకాడమీ, ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ -2023 ఒలంపియాడ్‌లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచారు. ధర్పల్లి సీఐ భిక్షపతి తన కార్యాలయంలో విద్యార్థులను శుక్రవారం అభినందించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోపాటు పోటీ పరీక్షలు, సాంకేతిక నైపుణ్యతపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య, గంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్ని తహసీల్దార్‌గా సాయిలు

వర్ని, ఏప్రిల్ 28 : వర్ని తహసీల్దార్‌గా సాయిలు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రావణ్‌కుమార్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు బాధ్యతలు అప్పగించడంతో కోటగిరి తహసీల్దార్ సాయిలుకు వర్ని తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

యువకుడి అదృశ్యం

మనూబాయ్

శక్కర్‌నగర్, ఏప్రిల్ 26: బోధన్ పట్టణానికి చెందిన నాగారం మనూబాయ్ అనే వ్యక్తి కనబడడం లేదంటూ ఆయన భార్య సుకన్య బోధన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. నిజామాబాద్‌లోని భారత్ గ్యాస్ గోదాంలో పనిచేసే తన భర్త రోజు మాదిరిగానే ఈనెల 22వ తేదీ ఉదయం 5గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదని, బంధువుల ఇండ్లలో, పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. ఫోన్ స్విచాఫ్ చేసి ఉందని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- **మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్**

ఇందల్వాయి, ఏప్రిల్ 26 : రూరల్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ కోరారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, లోలం గ్రామాల్లో బూత్‌స్థాయి కమిటీలతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు బూత్ సభ్యులు కృషిచేయాలని అన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధితోపాటు అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు దాసు, ఎంపీపీ రమేశ్‌నాయక్, వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు వసంత, నాయకులు పులి శ్రీనివాస్, గడ్కోల్ శ్రీనివాస్, పులి సాగర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

కాంగ్రెస్ వైఫల్యాలపై పోస్టు కార్డుల ఉద్యమం

జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నవీపేట, ఏప్రిల్ 26: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులుసీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులను పంపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు బోధన్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలలు గడిచినా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిందని అన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీతోపాటు వరికి రూ.500 బోనస్, మహిళలకు రూ.2500, రైతుబంధు తదితర హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. మరోసారి ఎంపీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఆగస్టు నాటికి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పడం ఎన్నికల స్టంట్ మాత్రమేనని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించేందుకు ప్రతి బూత్ కమిటీ సభ్యుడూ కష్టపడి పనిచేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు, మండల నాయకులు తెడ్డు పోశెట్టి, న్యాలకంటి అబ్బన్న, రమేశ్, సూరిబాబు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నేడు బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశాలు, రోడ్‌షోలు

- **డిచ్‌పల్లి నియోజకవర్గంలో పాల్గొననున్న బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్**
- **బాన్సువాడ నియోజకవర్గంలో పాల్గొననున్న జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే పోచారం**

డిచ్‌పల్లి/ సిరికొండ/ వర్ని/ మోస్రా (చందూర్), ఏప్రిల్ 26 : డిచ్‌పల్లి మండలకేంద్రంలోని సుగుణ గార్డెన్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండల నాయకులు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరిగే ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సమావేశం ఏర్పాటు చేశారని, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, రాజ్యసభ సభ్యుడు కేఆర్. సురేశ్‌రెడ్డి, జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. సాయంత్రం 4.30 గంటలకు సిరికొండ మండలం న్యావనందిలో ఎన్నికల ప్రచారం, కార్నర్ మీటింగ్, సాయంత్రం 6 గంటలకు గడ్కోల్‌లో ఎన్నికల ప్రచారం, ధర్పల్లి మండలం హోన్నాజీపేట్‌లో 7.30 గంటలకు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని వివరించారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వర్ని, మోస్రా, చందూర్‌లో బీఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్.. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డితో కలిసి నేడు (శనివారం) రోడ్ షోలు, కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. మోస్రాలో సాయంత్రం 6 గంటలకు, చందూర్‌లో రాత్రి 7 గంటలకు రోడ్‌షో, కార్నర్ మీటింగ్ ఉంటుందని, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్నిలో నిర్వహించే రోడ్‌షో, ప్రచార కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లాలి గిరి ఒక ప్రకటనలో కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి జైలుశిక్ష

వినాయక్‌నగర్, ఏప్రిల్ 26 : నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 9 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వారికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. మార్నింగ్ కోర్టులో నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ఎదుట శుక్రవారం హాజరు పర్చారు. 9 మంది వాహనదారులకు రూ.5 వేల జరిమానా విధించారు. సిద్ధాపురం సంజీవ్‌కు నాలుగు రోజులు, ఒడ్డె రాజుకు మూడు రోజులు, బేగరి ప్రశాంత్,లంబాడా సరిచంద్‌కు రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ వెల్లడించారు.

మాక్లూర్ మండలంలోని ఇద్దరికి..

మాక్లూర్, ఏప్రిల్26: మండలంలోని గుత్పతండాకు చెందిన ఇస్లావత్ నరేశ్, మానిక్‌బండార్ గ్రామానికి చెందిన మగ్గిడి ప్రకాశ్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ గురువారం పట్టుబడ్డారు. వీరిపై డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష విదించినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భర్తను చంపిన భార్య

- **కుటుంబ కలహాలే కారణం**
- **దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య**

మోపాల్ (ఖిల్లీవాడి), ఏప్రిల్ 26 : మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామంలో వేధింపులు భరించలేక భర్తను భార్య హత్య చేసిన ఘటన చోటు చేసుకున్నది. సీఐ సురేశ్ కుమార్, ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబకలహాలు, భర్త వేధింపులను భరించలేక శుక్రవారం తెల్లవారుజామున దిండుతో ఊపిరాడకుండా చేసి సాయిరెడ్డిని భార్య రాధ హతమార్చింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

కొత్తపల్లిలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్వోలు

కోటగిరి, ఏప్రిల్ 26 : మండలంలోని వివిధ గ్రామాల్లో బీఎల్‌వోలు శుక్రవారం ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా ఓటర్లకు పోల్ చీటీలను అందజేస్తున్నామని కోటగిరి, పొతంగల్ తహసీల్దార్లు సునీత, మల్లయ్య తెలిపారు. మే 2వ తేదీ వరకు పంపిణీ ప్రక్రియ పూర్తిచేస్తామని చెప్పారు.

కొనసాగుతున్న 'ఓపెన్' టెన్త్, ఇంటర్ పరీక్షలు

ఖిల్లీవాడి, ఏప్రిల్ 26 : జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించగా.. 1582 మంది విద్యార్థులకు 1442 మంది హాజరైనట్లు జిల్లా కో-ఆర్డినేటర్ తుల రవీందర్ తెలిపారు. ఇంటర్‌లో 1559 మంది విద్యార్థులకు 1420 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

కార్మిక, రైతు వ్యతిరేక బీజేపీని ఓడించాలి

- **ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య**

ఖిల్లీవాడి, ఏప్రిల్ 26 : కార్మిక, రైతు వ్యతిరేక బీజేపీని ఓడించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. మోపాల్ మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజాస్వామ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నేడు (శనివారం) జిల్లాకేంద్రంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో బహిరంగ సభ నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గ ఎర్రన్న, పీవైఎల్ ఉపాధ్యక్షుడు బండమీద నర్సయ్య, నాయకులు చిన్నయ్య, విజయేందర్, గంగాధర్, గంగారాం పాల్గొన్నారు.

సౌత్‌జోన్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు బయల్దేరిన జిల్లా క్రీడాకారులు

పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారులు

కంఠేశ్వర్, ఏప్రిల్ 26 : కర్ణాటక రాష్ట్రం తుంకూర్‌లో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 3వ జూనియర్ సౌత్ జోన్ జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు శుక్రవారం బయల్దేరినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ తెలిపారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో ఇటీవల జరిగిన రాష్ట్ర జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో సిద్ధార్థ, తిరుపతి, బాలికల విభాగంలో ఎస్.సౌమ్యారాణి, జె.వైశాలి, జి.సాత్విక, జి.శ్రావిక, టి.నేహశ్రీ, ఎన్ వైశాలి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న విద్యాశాఖ అధికారులు, కాకతీయ కళాశాల మేనేజ్‌మెంట్, అధ్యాపకులు

ఇంటర్, జేఈఈ మెయిన్స్‌లో 'కాకతీయ' విద్యార్థుల ప్రతిభ

ఖిల్లీవాడి, ఏప్రిల్ 26 : జిల్లాకేంద్రంలోని కాకతీయ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియెట్‌తోపాటు తొలిప్రయత్నంలోనే ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చారు. ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌లో జాతీయస్థాయి ర్యాంక్‌ను పొందిన తేజస్విని 967, కేతన 1220 ర్యాంకు సాధించారని కాకతీయ విద్యా సంస్థల చైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో ప్రతి విద్యార్థి ఇంటర్‌తోపాటు జాతీయ స్థాయి పోటీపరీక్షలైన ఐఐటీ, మెడికల్, ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. జేఈఈ మెయిన్స్‌లో మినహజ్ 934, సుప్రీత్ 965, శివప్రితం 987, మాలిక్ 974, హది 958 ర్యాంకులు సాధించారని వివరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రిటైర్డ్ ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘురాజ్, డైరెక్టర్ రామోజీరావు, సీహెచ్ రాజా, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

కోటగిరి మండలం వల్లభాపూర్‌లో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ కుమార్తె వివాహంతోపాటు కోటగిరిలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు బాబూ ఖాన్ తమ్ముడి వివాహ వేడుకలు శుక్రవారం జరిగాయి. వేడుకలకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

- కోటగిరి, ఏప్రిల్ 26

ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు

బోధన్ 108 సిబ్బందికి ప్రశంసాపత్రాలు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 26: ఏడాది కాలంగా ఉత్తమ సేవలు అందించిన 108 సిబ్బందికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు కల్పిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ మేడ్చల్‌లోని 108 జీవీకే, ఈఎంఆర్ఐ సంస్థల కార్యాలయంలో బోధన్ 108 టెక్నీషియన్ లక్ష్మణ్, పైలట్ జావీద్‌కు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఏడాదిగా అందిన ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించి అందించిన సేవలకు గాను రాష్ట్రస్థాయిలో ప్రశంసాపత్రాలు అందజేసి జీవీకే ఈఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్, సీఈవో వెంకటేశ్, ఖలీద్, పీఎం రవికుమార్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, జావీద్ మాట్లాడుతూ తాము చేసిన సేవలను గుర్తించి తమకు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవల ప్రశంసా పత్రాలు అందజేయడం ఆనందంగా ఉందని, దీంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు.

ప్రశంసా పత్రాలు అందుకుంటున్న బోధన్ 108 సిబ్బంది

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న ఏడీఈ

మోర్తాడ్(కమ్మర్‌పల్లి), ఏప్రిల్ 26: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్ గ్రామంలో ఇటీవల ధాన్యం ఆరబోస్తున్న సమయంలో 11కేవీ విద్యుత్ తీగలకు ట్రాక్టర్ తగిలి విద్యుదాఘాతంతో సామచిన్న గంగాధర్ అనే రైతు మృతి చెందాడు. మృతుడి భార్య సామ అమృతకు శుక్రవారం ట్రాన్స్‌కో ఏడీఈ వినోద్ రూ.5లక్షల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హాసాకొత్తూర్ మాజీ సర్పంచ్ పద్మ, మాజీ ఉప సర్పంచ్ రాజేశ్వర్, ఏఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి బాలబాలికల వ్యక్తిత్వ వికాస శిబిరం

బాల్కొండ, ఏప్రిల్ 26: మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో భగవాన్ శ్రీసత్యానంద మహర్షి గీతా భక్తజనాశ్రమంలో బాలబాలికల వ్యక్తిత్వ వికాస శిబిరాన్ని వచ్చేనెల 1 నుంచి 7వరకు నిర్వహించనున్నట్లు కార్యదర్శి జ్ఞానేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 15 ఏండ్ల మధ్య వయస్సు పిల్లలకు భగవద్గీత, నిత్యప్రార్థన శ్లోకాలు నేర్పనున్నట్లు తెలిపారు. నైతిక విలువలు, కథలు, ఆటలు, పుణ్యక్షేత్ర సందర్శన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. వారం పాటు ఆశ్రమంలోనే ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 50 మందికి శిక్షణ ఇస్తామని, వివరాలకు జ్ఞానేశ్వర్ 93469 06086, 83099 07339ని సంప్రదించాలని కోరారు.

మౌలాలీ తండాలో గ్రామసభ

రెంజల్, ఏప్రిల్26: మండలంలోని మౌలాలీ తండాలో శుక్రవారం అత్యవసర గ్రామసభను ఏర్పాటు చేసినట్లు ప్రత్యేక అధికారి, తహసీల్దార్ ఎంఏ ఖలీం తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జీపీ కార్యదర్శి రజినిని ఆదేశించారు. మినీట్యాంక్ ఏర్పాటు, వానకాలంలో రోడ్లపై నీరు నిల్వకుండా డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలను సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.

బెట్‌మొగ్రా పీఠాధిపతికి సన్మానం

స్వామీజీని సన్మానిస్తున్న బోధన్ వీరశైవ సమాజ్ ప్రతినిధులు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 26: బెట్‌మొగ్రా పీఠాధిపతి 108 షరస్థల బ్రహ్మసిద్ధ దయాల్ శివాచార్య స్వామీజీని శుక్రవారం బోధన్ వీరశైవ సమాజ్ ప్రతినిధులు శుక్రవారం సన్మానించారు. బోధన్ పట్టణంలోని చక్రేశ్వర శివమందిరంలో కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ధార్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు అజయ్ వడియార్, పురాణే అజయ్ కుమార్, నర్సింగ్ అప్ప, విఠలప్ప, సుంకిని శివ, శివకుమార్, షట్కర్ శివ, రవి పటేల్, గణపతి అప్ప, నాగనాథ్ పటేల్, పురాణే దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

జేపీ ప్రాథమిక సభ్యత్వం నుంచి ఒకరి సస్పెన్షన్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 26 : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకుడు మీసాల శ్రీనివాస్‌రావును పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రమశిక్షణా రాహిత్యం, పార్టీ నిబంధనలు ఉల్లంఘించినందుకు సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

SSC MEMO పోయినది

★SAMA SHIVA REDDY S/o SAMA MUTHYAM నాయొక్క SSC మెమో Roll No.1905124898 కొత్త ఇంటికి మారినప్పుడు పోయినది. ఎవరికైన దొరికినచో క్రింది నెంబర్‌లో తెలుపగలరు. Cell:7093271257.

NTZ-324648

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 ల